అయ్యోర్లు కావాలి

నాలుగు దశాబ్దాల చరిత్ర కలిగిన పాఠశాల. వేలాది మందికి విద్యాబోధన చేసి ఉన్నతులుగా తీర్చిన ఆ బడిలో ఉర్దూ పాఠ్యాంశాన్ని ఎంచుకున్న 215 మంది విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. ఇద్దరు ఉర్దూ ఉపాధ్యాయులు ఉండాల్సిన ఈ పాఠశాలలో ఒక్కరు కూడా లేకపోవడంతో ప్రధానంగా పదో తరగతి విద్యార్థులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు గడిచిపోయినా.. పుస్తకం తెరిచి పాఠం బోధించే దిక్కు లేకుండా పోయింది.

- ఉర్దూ టీచర్లు లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- బడులు తెరిచి 4 నెలలు కావస్తున్నా బోధకుల్లేని పాఠశాల
- అటకెక్కుతున్న 215 మంది ఉర్దూ విద్యార్థుల చదువులు
- 10వ తరగతి పరీక్షల్లో ఫెయిల్ అవుతామేమోనని భయం
- విద్యాశాఖాధికారులకు విన్నపాలు చేసినా పట్టించుకోని వైనం



వెంకటేశ్వరపురంలోని నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల

నెల్లూరు (వీఆర్సీసెంటర్): నగరంలోని 53వ డివిజన్ వెంకటేశ్వరపురంలోని నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో వెయ్యి మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 215 మంది విద్యార్థులు ఉర్దూ పాఠ్యాంశాన్ని ఎంచుకున్నారు. వీరిలో పదో తరగతి చదువుతున్న వారు 51 మంది ఉన్నారు. ఈ పాఠశాలలో ఇద్దరు ఉర్దూ ఉపాధ్యాయులను నియిమించాల్సి ఉంది. గతంలో ఇక్కడ ఇద్దరు ఉర్దూ ఉపాధ్యాయులు పనిచేస్తుండగా కొన్నేళ్ల క్రితం ఒకరు ఉద్యోగ విమరణ చేయడంతో ఒకరు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో సర్దుబాటు ప్రక్రియలో మరో ఉర్దూ ఉపాధ్యాయుడిని నియమిస్తూ విద్యార్థుల బోధనకు ఆటంకం లేకుండా చూసింది. అయితే ఆ పాఠశాలలో ఉన్న ఒక ఉపాధ్యాయుడు సైతం విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ఉద్యోగ విరమణ చేయడంతో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక సర్దుబాటు ప్రక్రియ ద్వారా కానీ, రెగ్యులర్‌గా ఆ పోస్టులు భరీ చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఉర్దూ బోధించే వారులేక, ముఖ్యంగా 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే 51 మంది ఉర్దూ విద్యార్థుల భవిష్యత్ అగమ్యగోచరంగా మారింది. విద్యార్థులతో పాటు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు ఈ పాఠశాలకు ఉర్దూ టీచర్లను నియమించి భవిష్యత్‌ను కాపాడాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



పాఠశాలలో ఉర్దూ టీచర్లు లేరని, వెంటనే నియమించాలని జిల్లా విద్యాశాఖాధికారుల దృష్టికి పలుసార్లు తీసుకెళ్లాం. అయినప్పటికీ ఉర్దూ టీచర్‌ను నియమించలేదు. ఉర్దూ విద్యార్థులు ఇబ్బందులు పడుడున్న మాట వాస్తవమే. త్వరలో ఉర్దూ టీచర్లను ఏర్పాటు చేస్తారన్న ఆశ ఉంది.

– మంజులావాణి, పాఠశాల హెచ్ఎం

బోధన లేక ఇబ్బందులు పడుతున్నాం



పాఠశాల తెరచినప్పటి నుంచి మా స్కూల్‌కు ఉర్దూ చెప్పే టీచర్లు లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. త్వరగా మాకు టీచర్లను నియమిస్తే బాగుంటుంది. రోజూ వచ్చి ఉర్దూ నేర్చుకోకుండా వెళ్తుంటే చాలా బాధగా ఉంది. పరీక్షల్లో ఫెయిల్ అవుతామోనని భయంగా ఉంది.

– ఎస్‌కే బషీరా, 10వ తరగతి విద్యార్థి

ఉర్దూ సబ్జెక్ట్ తీసుకుని బాధపడుతున్నాం



ఒక్క ఉర్దూ ఉపాధ్యాయుడు లేకపోవడంతో ఉర్దూ పాఠ్యాంశం చదవలేకపోతున్నాం. ఉర్దూ సబ్జెక్ తీసుకుని ఇలా బాధపడుతున్నాం. గతేడాది ఒక టీచర్ ఉంటే.. డిప్యుటేషన్‌పై మరో టీచర్ ఉండేవారు. రెగ్యులర్ టీచర్ రిటైర్డ్ అయ్యారు. అప్పటి నుంచి మాకు ఎవరిని నియమించలేదు.

– షబాహా, 10వ తరగతి విద్యార్థిని

పరీక్షలో ఎలా పాసవ్వాలి



6 నుంచి 10వ తరగతి వరకు ఉన్న ఉర్దూ విద్యార్థులకు ఒక్క రోజు కూడా ఉర్దూ క్లాస్ జరగలేదు. మిగతా వారి సంగతి ఎలా ఉన్నా 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే మా పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదు. ఉర్దూ సబ్జెక్టులో తక్కువ మార్కులు వచ్చినా, ఫెయిల్ అయినా అందుకు అధికారులే బాధ్యత వహించాలి.

– ఇఫ్రీన్, 10వ తరగతి విద్యార్థిని

మా భవిష్యత్‌తో ఆడుకోవద్దు



ఉర్దూ విద్యార్థులతో అధికారులు ఆడుకుంటున్నారు. ఈ పాఠశాలకు ఇద్దరు ఉర్దూ టీచర్ల నియమించాల్సి ఉంది. ఉన్న ఒక టీచర్ రిటైర్డ్ అయ్యారు. ప్రత్యామ్నాయంగా ఒక్కరిని కూడా నియమించుకుంటే ఎలా? ఇలా అయితే ఎలా చదవాలి, ఏమి రాయాలి, పబ్లిక్ పరీక్షలకు ఎలా ప్రిపేర్ కావాలి.

– అక్లాన్, 10వ తరగతి విద్యార్థి

ఎప్పుడు వస్తారు... ఎలా చెప్తారో



స్కూల్ హెడ్‌మాస్టర్‌ను అడిగితే ఉర్దూ టీచర్ కోసం అధికారులకు చెప్పాం.. వస్తారని 3 నెలలుగా చెబుతున్నారు. ఇప్పటి వరకు ఉర్దూ బోధించే టీచర్ రాలేదు. ఉర్దూ టీచర్ ఎప్పుడు వస్తారో, ఎలా చెప్తారో తెలియడం లేదు. ఇప్పటికే పలు యూనిట్ పరీక్షలు కూడా జరిగాయి. ఉర్దూ టీచర్ లేక యూనిట్ పరీక్షలు కూడా రాయలేకపోయాం.

– హర్షదుల్లా, 10వ తరగతి విద్యార్థి

క్లుప్తంగా

విద్యార్థులకు చట్టాలపై అవగాహన


మాట్లాడుతున్న సంతపేట ఇన్‌స్పెక్టర్ మద్ది శ్రీనివాసరావు

నెల్లూరు (క్రైమ్): నగరంలోని రంగనాయకులపేట పీఎంఆర్ హైస్కూల్‌లో సంతపేట ఇన్‌స్పెక్టర్ మద్ది శ్రీనివాసరావు, బీవీఎస్ బాలికల పాఠశాలలో నవాబుపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా విద్యార్థులకు రక్షణ చట్టాలపై మంగళవారం అవగాహన కల్పించారు. గుడ్, బ్యాడ్ టచ్‌లు, మత్తు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, ట్రాఫిక్ నిబంధనలు తదితరాలను వివరించారు. ఈవ్‌టీజింగ్ చేయరాదని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర వేళల్లో 112కు కాల్ చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఎమ్మెల్సీని కలిసిన ఐదో డివిజన్ నేతలు


ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డిని కలిసి అభినందనలు తెలియజేస్తున్న పార్టీ నాయకులు

నెల్లూరు (బారకాసు): వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని నగరంలోని 5వ డివిజన్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు మంగవారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. చంద్రశేఖర్‌రెడ్డిని శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరాములురెడ్డి, రమణారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, పెంచలరెడ్డి, శ్రీరాములురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిది మంది పోలీస్ సిబ్బందిపై బదిలీ వేటు

నెల్లూరు సిటీ: నెల్లూరురూరల్ పోలీసుస్టేషన్‌లో రెండు రోజుల వ్యవధిలో తొమ్మిది మంది సిబ్బందిని ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఏఎస్‌ఐలు శ్రీనివాసులరెడ్డిని పొదలకూరుకు, రవిచంద్రను మనుబోలుకు, హెడ్‌కానిస్టేబుల్స్ వేణును రాపూరుకు, మస్తాన్‌రావును ఆత్మకూరుకు, భాస్కర్‌ను పొదలకూరుకు, ప్రసాద్‌ను కందుకూరుకు, కానిస్టేబుల్స్ అల్లాభక్షును విడవలూరుకు, మునికృష్ణను వోలేటివారిపాళెంకు, శ్రీనును ఉలవపాడుకు బదిలీ చేసినట్లు సమాచారం. అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్ అని చెబుతున్నప్పటికీ బదిలీల వెనుక అవినీతి, అక్రమాల ఆరోపణలే కారణమని తెలుస్తోంది.

భక్తిశ్రద్ధలతో గంధమహోత్సవం


గంధమహోత్సవం తీసుకువస్తున్న మత పెద్దలు

నెల్లూరు (బృందావనం): పెద్దబజారు దాడివారి వీధిలోని హజ్రత్ సయ్యద్ కంతర్ షా ఔలియా ఉరఫ్ సయ్యద్ కరామతుల్లా షా ఖాదరి 655వ గంధమహోత్సవం సోమవారం అర్ధరాత్రి భక్తి శ్రద్ధలతో చేపట్టారు. దర్గా సజ్జదా నషీన్ మొహ్మద్ ముష్తాఖ్ అహ్మద్ ఆధ్వర్యంలో విశేషంగా నిర్వహించారు. గంధ మహోత్సవంలో భాగంగా మంగళవారం రాత్రి 10 గంటలకు మిలాద్, బుధవారం ఉదయం 10 గంటలకు తహలీల్ ఫాతెహా, రాత్రి 10 గంటలకు ఖవ్వాలి కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

నేడు భక్తి రంజని-భజన మంజరి సంగీతం


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న లక్ష్మీప్రసన్న, కృష్ణకుమార్, సంగీత్‌సౌరభ్

నెల్లూరు(బృందావనం): పురమందిరంలో శ్రీత్యాగరాజ సాంస్కృతిక సభ ఆధ్వర్యంలో సంగీత, సాహిత్య ప్రక్రియలో భాగంగా 'భక్తి రంజని–భజనమంజరి' కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం 6 గంటలకు నిర్వహిస్తున్నట్లు సభ వ్యవస్థాపకులు ఏ లక్ష్మీప్రసన్న తెలిపారు. నగరంలోని ఆర్ఆర్‌స్ట్రీట్‌లో ఉన్న ఆ సంస్థ కార్యాలయంలో మంగళవారం కార్యక్రమ ఆహ్వాన పత్రికలను సభ్యులు ఎస్. కృష్ణకుమార్, ఎస్. సంగీత్‌సౌరభ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ జనరంజకమైన శాస్త్రీయ సంగీత, సాహిత్య విశిష్టతను సామాన్యుల చెంతకు చేర్చాలన్న సంకల్పంతో జిల్లాలో తొలి సారిగా ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. సంగీత, సాహిత్యాభిమానులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

భూములపై న్యాయపరమైన హక్కుల కల్పనకు చర్యలు



నెల్లూరు (దర్గామిట్ట): రాష్ట్రంలో పేద ప్రజలకు భూములపై న్యాయపరమైన హక్కులు కల్పించడానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం అమరావతి నుంచి మంత్రి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో ఫ్రీ హోల్డ్ ల్యాండ్స్ వెరిఫికేషన్ పూర్తి చేయాలన్నారు. రాష్ట్రంలో రెవెన్యూ అంశాలు అసైన్డ్ భూములు, ఇనాం భూములు, చుక్కల భూముల సమస్యలు పరిష్కరించడానికి ఆరు జిల్లాలను పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేశామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నెల్లూరు నుంచి కలెక్టర్ ఓ ఆనంద్, జేసీ కె కార్తీక్, డీఆర్వో ఎస్.లవన్న తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల ఆరోగ్యంపై అవగాహన


వృద్ధులకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న ఎన్‌సీడీ అధికారులు

నెల్లూరు (అర్బన్): వృద్ధులు తమ ఆరోగ్యంపై అవగాహన పెంచుకుని జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారని నాన్ కమ్యూనికబుల్ డీసీజెస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధీర్‌కుమార్ సూచించారు. మంగళవారం అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జీజీహెచ్‌లో వృద్ధులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. వృద్ధుల కోసం పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, జీజీహెచ్‌ల్లో ముగ్గురు ఫిజియోథెరపిస్టులు, 10 ఎంఆర్‌డబ్ల్యూ సిబ్బంది ఆరోగ్య సేవలందిస్తున్నారన్నారు.

ఖాళీ ప్లాట్ల యజమానులకు నోటీసులు

- కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు (బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని ఖాళీ స్థలాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా యజమానులకు నోటీసులు జారీ చేయాలని కమిషనర్ సూర్యతేజ అధికారులను ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక రైల్వేఫీడర్స్ రోడ్డు, రంగనాయకులపేట, మూలాపేట గణేశ్ ఘాట్, హరనాథపురం తదితర ప్రాంతాల్లో కమిషనర్ మంగళవారం పర్యటించారు. ఆయన మాట్లాడుతూ ఇంటింటా చెత్త సేకరణ సమర్థవంతంగా నిర్వహిస్తే, బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేయడాన్ని ఆపగలమన్నారు. గణేశ్ ఘాట్ వద్ద పశువులను కట్టివేయడం, పరిసరాలను అపరిశుభ్రం చేయడంపై ఫిర్యాదు అందుకున్న కమిషనర్ ఘాట్ ప్రాంగణాన్ని పరిశీలించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న స్థానికులను హెచ్చరించి, పశువులను గోశాలకు తరలించాలని వెటర్నరీ వైద్యుడిని ఆదేశించారు. అనంతరం 49వ డివిజన్‌లో కమిషనర్ పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం హరనాథపురంలోని ఖాళీ ప్లాట్‌ను పరిశీలించారు. ప్లాట్లను పరిశుభ్రంగా ఉంచుకోని యజమానులకు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. స్థానిక సచివాలయాలను సందర్శించి కార్యదర్శులతో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఆరోగ్యాధికారి డాక్టర్ చైతన్య, రెవెన్యూ అధికారి సమ్మద్, పలు విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.


లబ్ధిదారురాలికి బ్యాంకు రుణాన్ని అందజేస్తున్న కమిషనర్ సూర్యతేజ

గృహ రుణాల మంజూరు వేగవంతంచేయండి

లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా రుణ మంజూరు వేగవంతం చేయాలని కమిషనర్ సూర్యతేజ బ్యాంకు అధికారులకు సూచించారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం నెల్లూరు సిటీ, రూరల్‌కు సంబంధించిన గృహాలకు బ్యాంకు రుణాల మంజూరుపై బ్యాంకు, మెప్మా అధికారులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఐదుగురు లబ్ధిదారులకు రూ.35 వేలు రుణాన్ని కమిషనర్ అందజేశారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ శర్మద, మెప్మా పీడీ రవీంద్ర, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, ఎల్‌డీఎం హౌసింగ్ డీఈలు, ఏఈలు, మెప్మా సిబ్బంది, వివిధ బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల మూసివేత

- తెరవబోమని తెగేసి చెప్పిన సిబ్బంది
- సిబ్బందితో అధికారుల చర్చలు
- అరకొరగా తెరుచుకున్న దుకాణాలు


నెల్లూరు నగరంలో మూసివేసిన మద్యం దుకాణం

నెల్లూరు (క్రైమ్): రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బంది మంగళవారం విధులకు గైర్హాజరయ్యారు. దీంతో జిల్లా వ్యాప్తంగా మద్యం దుకాణాలు మూతపడ్డాయి. 2019లో అప్పటి ముఖ్యమంత్రి ప్రభుత్వం ఆధ్వర్యంలోనే మద్యం దుకాణాలను ఏర్పాటు చేశారు. ఏపీ బేవరేజస్ కార్పొరేషన్ ద్వారా అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన మద్యం దుకాణాల్లో పనిచేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇంటర్వ్యూలు నిర్వహించి నిరుద్యోగులకు ఉపాధి కల్పించింది. ఐదేళ్లు ఉద్యోగాల్లో కొనసాగారు. తాజాగా కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మద్యం దుకాణాలను తొలగించి ప్రైవేట్ దుకాణాల ఏర్పాటుకు సోమవారం అర్ధరాత్రి నోటిఫికేషన్ విడుదల చేసింది. నూతన మద్యం పాలసీతో సిబ్బంది వీధిన పడనున్నారు. ఇప్పటికే పలు దఫాలు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు ప్రభుత్వాన్ని వేడుకున్నా.. ఫలితం లేదు. మంగళవారం దుకాణాలను తెరిచేందుకు మొండికేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగ భద్రత కల్పించాలనీ, దీనిపై స్పష్టమైన హామీ వచ్చే వరకు దుకాణాలు తెరవబోమని స్పష్టం చేశారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టి. శ్రీనివాసరావు, ఈఎస్, ఐఎంఎల్ డిపో మేనేజర్లను అప్రమత్తం చేయడంతో వారు సిబ్బందితో చర్చించారు. వారికి సర్ది చెప్పడంతో కొన్ని ప్రాంతాల్లో సిబ్బంది దుకాణాలను తెరవగా ఒకటి, రెండు ప్రాంతాల్లో రాత్రైనా దుకాణాలు తెరుచుకోలేదు. దీంతో మందుబాబులు బార్ల ముందు క్యూకట్టారు. ఇదే అదనుగా బార్ల నిర్వాహకులు ధరలు రెట్టింపు చేసి జేబులు నింపుకున్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

నెల్లూరు సిటీ: రక్తదానం చేయడం ద్వారా మరో ప్రాణాన్ని కాపాడుతామని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు తెలిపారు. ధనలక్ష్మీపురంలోని జెడ్పీ హైస్కూల్‌లో జాతీయ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. డీఎస్పీ శ్రీనివాసరావు పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫారం అందజేశారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ అధ్యక్షుడు కుంచాల విజయభాస్కర్, పాఠశాల హెచ్ఎం గిరిసింగ్, పీఈటీ శ్రావణ్, మోపూరు భాస్కర్‌నాయుడు, సొసైటీ సభ్యులు పవన్‌కుమార్‌రెడ్డి, ఈశ్వరయ్య, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఆకట్టుకుంటున్న స్టైల్స్ అండ్ వీవ్స్ వస్త్ర ప్రదర్శన


కొనుగోలు చేస్తున్న పలువురు మహిళలు

నెల్లూరు (బారకాసు): నగరంలోని మాగుంట లేఅవుట్‌లో ఉన్న పిచ్చిరెడ్డి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన స్టైల్స్ అండ్ వీవ్స్ ప్రదర్శన అందరిని ఆకట్టుకుంటుంది. దేశంలోని వివిధ రాష్ట్రాల డిజైనర్ల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ వస్త్ర ప్రదర్శనలో ఫ్యాషన్ ప్రియులు, మగువలు తమకు కావాల్సినవి కొనుగోలు చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకురాలు మంజులతా మాట్లాడుతూ వివాహ, పండగలతో పాటు ఇతర ప్రత్యేక సందర్భాల్లో ధరించే విధంగా దేశంలో ఎంతో పేరుగాంచిన పలు రకాల వస్త్రాలైన ఉప్పాడ, కళంకారి, మంగళగిరి, ప్రింట్ చీరలు, సిల్క్ చీరలు, కాటన్, కశ్మీర్ సిల్క్, బ్లౌజ్‌లు, టాప్స్, వన్ గ్రామ్ గోల్డ్ జువెల్లరీ అందుబాటు ధరలో లభిస్తున్నాయన్నారు. ఈ ప్రదర్శన 3వ తేదీ రాత్రి 9 గంటల వరకు ఉంటుందన్నారు.

రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు రత్నం విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న స్కూల్ యాజమాన్యం

నెల్లూరు (టౌన్): రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు రత్నం విద్యార్థులు ఎంపికయ్యారని ఆ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు తెలిపారు. మంగళవారం రత్నం స్కూల్‌లో విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ అండర్–14 బాలికల విభాగంలో జననిరిక్వర్, భావజ్ఞ, హంసిని, అండర్–17 బాలికల విభాగంలో కృతిక, కిరణ్, జాన్వీ, ఆరాధ్య, అండర్–18 బాలికల విభాగంలో మోక్ష, అండర్–17 బాలుర విభాగంలో వరుణ్‌రెడ్డి రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికయ్యారన్నారు. కోచ్ భరద్వాజ, మేనేజర్ అజేయ్‌సింగ్, ప్రిన్సిపల్ మణిమాల పాల్గొన్నారు.

దసరాకు 82 ప్రత్యేక బస్సులు

నెల్లూరు సిటీ: దసరా పండగ నేపథ్యంలో ఇతర రాష్ట్రాల నుంచి నెల్లూరుకు వచ్చే ప్రయాణికుల కోసం ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.మురళీబాబు తెలిపారు. ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు 82 ప్రత్యేక బస్సులను ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయన్నారు. 8వ తేదీ హైదరాబద్ నుంచి నెల్లూరుకు 6 బస్సులు, 9వ తేదీ 11 బస్సులు, 10వ తేదీ 22 బస్సులు, 11వ తేదీ 26 బస్సులు ఏర్పాటు చేశారు. బెంగళూరు నుంచి నెల్లూరుకు ప్రతి రోజూ 2 బస్సులను అదనంగా నడపనున్నారు. విజయవాడ నుంచి నెల్లూరుకు 5 బస్సులు, చెన్నై నుంచి నెల్లూరుకు 5 బస్సులు, కడప నుంచి నెల్లూరుకు 5 బస్సులు ఏర్పాటు చేశామన్నారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలి

- విద్యార్థి యుజవన సంఘాల డిమాండ్

నెల్లూరు(దర్గామిట్ట): విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలని సోమవారం వామపక్ష విద్యార్థి యువజన సంఘాలు కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. వామపక్ష విద్యార్థి యువజన సంఘాల నాయకులు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ 32 మంది ప్రాణ త్యాగాలతో వచ్చిందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నరేంద్రమోదీ ప్రభుత్వం రూ.4 లక్షల కోట్ల విలువ చేసే విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అదానీ, అంబాని, ఫోక్సో కంపెనీలకు కట్టబెట్టాలని చూస్తోందన్నారు. 4,290 మంది కార్మికుల పాసులను రద్దు చేయడం దారుణమన్నారు. ప్రభుత్వం ఒక పక్క ప్రైవేటీకరణ చేయడం లేదని, కేవలం అక్కడున్న స్థలాలను మాత్రం ప్రైవేట్ పరం చేస్తున్నామని బీజేపీ ప్రభుత్వం దొంగ దెబ్బ తీస్తోందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి, యువజన సంఘాలతో పాటు ట్రేడ్ యూనియన్, రైతు సంఘాలు అన్ని కలిసి రాష్ట్రం మొత్తం ఆందోళనలు చేపడతామని, భగత్ సింగ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకునే వరకు పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు మున్నా, రమణ, మస్తాన్, నరేంద్ర, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట నిరసన రిలే దీక్ష చేపడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

కార్మికులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- కార్పొరేషన్ ఎదుట ధర్నా

నెల్లూరు (బారకాసు): నగర పాలక సంస్థలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కమిటీ గౌరవ అధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు వచ్చే జీతం అధిక వడ్డీలు, తండలు చెల్లించడానికి సరిపోతుందన్నారు. మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వ బ్యాంకుల ద్వారా రుణాలు తక్షణమే ఇప్పించాలన్నారు. జీతంలో నెలకు లక్షల రూపాయలు కట్ చేస్తున్న ఈఎస్‌ఐ ద్వారా వైద్య సదుపాయం అందడం లేదన్నారు. పెరిగిన నగర జనభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వమే సంక్షేమ పథకాలు కార్మికులకు అమలు కావడం లేదని, వెంటనే అమలు చేయాలని, కార్మికులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కిన్నెరకుమార్, కొండమ్మ, సునీల్, దేశమూర్తి, అశోక్, శ్రీనివాసులు, లోకేశ్, కామాక్షమ్మ, భాగ్యమ్మ, వజ్రమ్మ, మనోజ్, శివ, షఫీ, మారుతి, బాలు, ముని, మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్మికులు

సైన్సు ఫలాలు సామాన్యులకు అందాలి

నెల్లూరు(అర్బన్): శాస్త్ర, సాంకేతిక రంగాల్లో సాధిస్తున్న సైన్సు ఫలాలు సామాన్యులకు చేరువ కావాల్సిన అవసరం ఉందని జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకుడు డాక్టర్ రఫీ అన్నారు. జేవీవీ ఆధ్వర్యంలో నగర, మండల స్థాయి చెకుముకి టాలెంట్ సైన్సు పోటీలు మంగళవారం స్థానిక హరనాథపురంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జరిగాయి. తొలుత ప్రశ్నపత్రాలను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. డాక్టర్ రఫీ మాట్లాడుతూ సైన్సు ఫలాలు సామాన్యులకు అందడమంటే గ్రామీణ ప్రాంతాల్లో అత్యధిక దిగుబడి నిచ్చే వంగడాలు రైతులకు తక్కువ ధరకు అందించాల్సి ఉందన్నారు. విద్య, వైద్య రంగాల్లో వచ్చిన సాంకేతిక నైపుణ్యాలను ప్రభుత్వ పాఠశాలలో చదివే బిడ్డలకు అందించాల్సి ఉందన్నారు. నగరంలో వివిధ పాఠశాలల నుంచి 300 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. 33 మండలాల్లో మండల స్థాయిలో ఒకే దఫా టెస్ట్ జరిగిందన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహిస్తామన్నారు. టాలెంట్ టెస్ట్ అనంతరం నిర్వహించిన ఇంద్రజాల ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు డాక్టర్ దయాకర్, డాక్టర్ శ్రీనునాయక్, హెచ్ఎం విజయప్రకాష్, విజయకుమార్, డాక్టర్ లహరి, కృష్ణారావు, మాదాల రాము, కృష్ణ, మోహన్‌రెడ్డి, విద్యాచరణ్, నెహేమియా తదితరులు పాల్గొన్నారు.


చెకుముకి సైన్సు టాలెంట్ టెస్ట్ పత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు (వీఆర్సీసెంటర్): నగరంలోని బీవీనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని నెల్లూరు టౌన్ విద్యుత్‌శాఖ ఈఈ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. లెక్చరర్స్ కాలనీలో 11కేవీ విద్యుత్ ఫీడర్‌లో మరమ్మతులు, విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే కార్యక్రమాలు చేపడుతున్న నేపథ్యంలో లెక్చరర్స్ కాలనీ, మాగుంటలే అవుట్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.